# వాళ్ళనలా వదిలేద్దాం

శ్రీ నేమాని సంగమేశ్వరరావు

(గతసంచిక తరువాయి)

"వసూ! వసూ" అంటూ కేక పెట్టేడు. బహుశః అనుకున్న దానికంటె ఎక్కువ గట్టిగానే!

పళ్లతోము పుల్ల చెంబులో నీళ్లతో ప్రత్యక్షమయింది వసుంధర.

అక్కడ స్టూలుమీద వాటిని పెట్టింది.

"ఎందుకండీ అంత పెద్ద కేకలు! నేను ఎక్కడికయినా వెళ్లిపోయేననుకున్నారా? లేక మీకు తెలియకుండా ఎవరినయినా తెచ్చుకున్నాననుకున్నారా?" అంది అతి సహజంగా మర్మందాస్తూ.

"ఛీ! ఛీ! అలా నేనెప్పుడూ అనుకో లేదు! అనుకోనుకూడాను!" అన్నాడు ప్రభాకరం మరొక పక్కచూస్తూ.

"ఇందండి! ముఖం కడుక్కోండి. కాఫీ తాగి వెళుదురుగాని లెండి!" అంటూ నీళ్ళ పుడక అందిచ్చింది.

"అవునుగాని వసూ..." అడుగబోయి ఆగేడు నోట్లో పలుదోముపుల్ల నములుతూ.

"చెప్పండి! ఆగేరెందుకు?"

"అహ! ఏం లేదులే?"

"దాస్తారెందుకు? నేను ఎక్కడికి వెళ్ళేననా?" అంది కళ్ళలో చమకులు తిప్పుతూ!

"అదికాదు! పర్సులోది... అంతా చేక్కేసేవే అన్నాడు కొంచెం బెలుకుగా"

"ఓస్! అదా సంగతి! అంతా అంటే ఎంత? ... డెబ్బయి రూపాయిలేగా!"

"అవుననుకో."

"మరేం లేదు! ఒక చిన్న అవుసరం వచ్చింది! ఒకచోట అర్జంటుగా సర్దుబాటు చెయ్యవలసివచ్చింది! రెండు మూడు రోజులలో ఫిరాయిస్తానులెండి!" అంది రెండు చేతులూ ప్రభాకరం వెనుకనుండి బుజం మీద వేసి వేలబడుతూ.

"ఆ! ... అహ! ... అదికాదు... అడిగేను ఊరికనే ... మళ్లా ఫిరాయించ నక్కరలేదులే! అయినా నువ్విచ్చేవ్! నేను పుచ్చుకున్నాను! రెండూ నిజమే!" సముద్రపుహోరులా నవ్వేడు. పళ్లుబయటకు కనిపిస్తునట్లు కృత్రిమంగా నవ్వుతూ అతని నవ్వుతో స్కృతికలిపింది వసుంధర.

ఇంటిదారి పట్టిన ప్రభాకర రావు వసుంధ

రను దమయంతిని ఒక తక్కెటలో వేసి తూస్తూ నడుస్తున్నాడు. త్రాసు ఎప్పుడూ దమయంతి ప్రక్కే మొగ్గు చూపిస్తున్నది.

తను నిన్న ఉదయం వచ్చి యింటికి వెళ్ళకుండా ఏంచేస్తున్నట్లు? ఎక్కడ తిరుగుతున్నట్టు? తన సామాను అవీ తననౌకరు స్టేషనుకు రాగానే వాడిద్వారా యింటికి పంపించేడు. తను చేస్తున్న రాచకార్యాలివి! తల్లిని తెక్కే చెయ్యాడు. తండ్రికి మాత్రం కొంచెం జడుస్తాడు. ఇంట్లో ఏమిటీ మాపణ చెపుదామా అని ఆలోచిస్తూ ప్రభాకర రావు దిక్కులు చూడకుండా దిగువకు రోడ్డుమాత్రంచూస్తూ జేబులో చేతులు పెట్టికొని తాపీగా నడుస్తున్నాడు.

"ఏంబాబూ! ఎప్పుడొచ్చేవ్?"

అన్నప్రశ్న తనకు వినబడగానే జేబులో చేతులుతీసి ఎదురుగా చూసేడు.

రఘునాథరావుగారు - దమయంతి తండ్రి. చిన్నకంగారు పడ్డాడు. వెంటనే తన్నుతాను సమాళించుకొని "నమస్కారమండీ! ఏది నిన్నమధ్యాన్నము మెయిలులో వచ్చేను! శేషగిరికనిపించి యింటికి తీసికెళ్ళేడు. మీారు అప్పుడు యింట్లోలేరు" అన్నాడు కొంచెము తడుముకుంటూ

"M B B S అయిపోయింది కదూ"

"ఆ! అయిపోయిందండీ!"

"ప్రాక్టీసు యిక్కడే పెడతావా బాబూ"

"ఏదీ ... ఇంకా నిశ్చయించలేదు!... అయినా యిక్కడే పెడదామనుకుంటున్నాను"

"సంతోషం నాయినా! అప్పుడప్పుడు మా యింటికి వస్తూవుండు!" అంటూ రఘునాథరావుగారు వెళ్ళిపోవడం చూసి Thank god అని అనుకుంటూ ముందుకు సాగుతున్నాడు ప్రభాకరం.

ఇంటి మెట్లు ఎక్కుతున్న ప్రభాకరం, హాలులో తనతండ్రి పేపరు చదువుకుంటూ కూర్చోడం చూసి కొంచెం "డంగయ్యేడు." కాని ఆగిపోకుండా అడుగులు వేస్తూ యింట్లోకి దారి తీసేడు.

"ఏంరా ప్రభాకర్! నువ్వు ఈ వూరు వచ్చిందెప్పుడు? ఇంటికివస్తున్నదెప్పుడు?" అన్నాడు సీతాపతి కొంచెం కరుకుగా. భూమిపగిలినట్టు, అందులో తనుకూరుకుపోయినట్లు భావించేడు ప్రభాకరం.

"లేదు! లేదు! ... నాన్నా .... స్నేహితులు బలవంతం చేస్తే వాళ్లతో పిక్చరుకి వెళ్ళేను. రాత్రి అక్కడే పడుకున్నాను ....." అన్నాడు ఇనెస్పెక్టరు ముందు స్కూలు కుర్రాడు మాట్లాడుతున్నట్లు.

"చాల్లేవోయ్! స్నేహితులు! స్నేహి

తులు చట్టబండలయిన ట్లువుంది! నిన్న బాగు చెయ్యడానికా? లేక పాడు చెయ్యడానికా వాళ్లు! లే! వెళ్లు!'' అంటూ పేపరు పేజీలు తిప్పసాగేడు తండ్రి.

''పోనీలే'' అని అనుకుంటూ తన గదిలోకి దారి తీసేడు ప్రభాకరం.

5

రాత్రి పదిగంటల తరువాత తనభార్య వచ్చి ప్రక్కను కూర్చోగానే హుషారుగా లేచి పేపరు ఒకమూల పెట్టి చుట్టముట్టించేడు రఘునాధరావు.

''ఏం! ఇవాళ ఇంతదయవచ్చింది. ఈ దీనుడిమీద?'' అన్నాడు నాటకాల వాళ్లలాగ.

''బాగున్నాయ్ మాటలు! వయస్సు ముదురుతున్నకొద్దీ రసికత్వం ఎక్కువ అవుతున్నట్టువుంది!'' అందినవ్వుతూ. ఒక్క నిముషం తరువాత మళ్లా ఆమె ఇలా అంది. ''అవునుగాని ఈ సంగతి మీరు గమనించేరా?''

''ఏసంగతి?''

''అదే! మన దమయంతిసంగతి?''

''ఏం? ఏమయింది?'' అన్నాడు మామూలుగానే!

''మొగవాళ్ళకేమీ అంతగా తెలీదు- మాకు తెలిసినట్లు; మన అమ్మాయి ఏదో వ్యధ మనస్సులో పడుతున్నట్టువుంది! రోజురోజుకు కృంగి కృశించిపోతున్నాది. చూడండి దాని ముఖం! ఇదివరకులాగ కళాకాంతులు లేనేలేవ్! ఎప్పుడూ పరధ్యాన్నము - నిరుత్సాహం!'' అంది బాధపడుతూ.

''నిజమే సుమీ? నేనూ అదికని పెట్టేను - దీనికేమంటావ్?''

''ఏమనడానికి ఏముంది? 19 సంవత్సరములువచ్చేయ్! ఇంకా చదువుచదువు అని మొత్తుకుంటే ఎలాగు! ఆడదానికి చదువెందుకు చెప్పండి? ఇంకో రెండేళ్ళు చదివిస్తే అది పిచ్చెత్తిపోతుంది కూడాను! ఏ వయస్సులో ఏది వుండాలో అది వుండాలి! ...'' అంది భారంగా.

''అంతేనంటావా?''

''అంతే! నిశ్చయంగా అంతే! ఇంక ఈ చదువులు సంధ్యలు ఆపించి ఎవరికో ఒకరికి ముడి పెట్టేయండి! లేకపోతే...'' అన్న భార్యమాటలు కొంచం గాయపరచాయి రఘునాధరావును.

భర్త మాట్లాడకుండా మంచము మీద చేరబడడముచూసి తనూ తన మంచం మీదకి వెళ్ళి ముసుగుకప్పింది.

భార్య వెళ్ళిపోగానే ఆలోచనా సముద్రములో మునిగిన రఘునాధరావుకు ఒకదారి తెన్నూ కనిపించలేదు.

నిజమే! తనూ అదే అనుకున్నాడు...

అయితే చదువూ సంస్కారముగలది తన కూతురు కాబట్టి తన జీవిత నిర్ణయం తనే చేసుకోగలదు అని అనుకున్నాడు. ఆడపిల్ల కావడంవల్ల సిగ్గుపడి బయటకు చెప్పలేక పోతున్నాదేమో!

తన భార్య ఎవరినో ఒకరిని ముడివేసెయ్యమని సులువుగా చెప్పింది. చెప్పడంలో మహాసులువుగా చెప్పింది! కాని ఎవరో ఒకరు అంటే ఎవరు? ఇది ఒకనాటి మాట కాదే! జీవితంతో పోరు.

కళ్లు మూసుకొని ఆలోచిస్తున్న రఘునాధరావు ఎదుట సినీమారీలు తిరుగుతూ దమయంతికివరులు ఒకరి తరువాత ఒకరు కనిపిస్తున్నారు. ఆఖరికి ప్రభాకరరావు కూడా అందులో కనిపించగానే ఒక నిర్ణయానికి వచ్చేడు.

"ఏమే! పడుకున్నావా?" అన్నాడు భార్యను పిలుస్తూ.

ఆమె లేచింది. "లేదండీ! మీరింకా పడుకోలేదూ!"

"ప్రభాకరరావునుగురించి నీ వుద్దేశ మేమిటి?"

"ఏం! మంచివాడే! సాంప్రదాయం కూడా మంచిదే. ఈడూ జోడూ బాగానే వుంటుంది."

"అయినా అమ్మాయిని ఒకమారు కదిపిచూడు! సిన్న అబ్బాయి అతన్ని మనయింటికి తీసుకొచ్చి అతని ఎదుట అమ్మాయి చేత పాటపాడించి వారిద్దరికీ పరిచయం చేసేడట - అదీ ఒకందుకు మంచిదే అయింది-" అన్నాడు కొంచెం రిలీఫ్‌గా.

"అయినా కట్నకానుకలు ..."

భార్యమాటకు అడ్డువస్తూ "అవన్నీ నీకెందుకు? సీతాపతి నా చిన్ననాటి స్నేహితుడు. సరళహృదయుడు. మంచివాడు! బహుశా యిలాంటి లావాదేవీలేమీవుండ కూడదు! ... అయినా అమ్మాయిదగ్గర ఒకమాటు ఈ విషయం ఎత్తిచూడు..." అంటూ తను నిద్రపోసాగేడు రఘునాధరావు.

ఉదయం దమయంతి లేచేసరికి హాలులో ఏదో గొడవ జరుగుతూవుంది. మేడగది బయటకువచ్చి బాల్కనీ గోడపట్టుకొని నిలబడిచూసింది.

పాలవాడు తల్లీ వాదించుకుంటున్నారు.

"నీళ్ళలో పాలుకలుపుతున్నావ్" అని తల్లి అంటే "లేదమ్మా! పాలలో నేనీళ్లు కలుపుతున్నాను" అని వాడు క్షమాపణ చెప్పుకుంటున్నాడు.

తను నవ్వుకుంది. గదిలోపలకు వెళ్ళింది.

అద్దంలో ముఖంచూసుకొని, చీర సవరించుకొని మెట్లుదిగి కిందికి వచ్చింది దమయంతి.

“ఏం తల్లీ ! లేచేవా ! ముఖం కడుక్కో ! కాఫీ త్రాగుదువుగాని !” అంది తల్లి ప్రేమతో.

పేష్టు, బ్రష్ తీసుకొని టవలు భుజం మీద వేసుకొని బాత్ రూంలోకి నడిచింది దమయంతి.

పొగలు కక్కుతున్న కాఫీ ఒక్కొక్క గుక్కే తాగుతూ ఆలోచిస్తున్నాది దమయంతి.

(సశేషము)







అన్ని మందుల షాపులలోను లభించును